కథా నిలయం
3936
శ్రీకాకుళం

# నీలి జాకట్టు

డాక్టర్ కరుణాకరరావు కన్సల్టింగ్ రూమ్ ముందర హాలులో సంగమేశం చాలా బిజీగా ఉన్నాడు. సంగమేశం వచ్చిన వాళ్లందరినీ కూర్చోబెట్టి వాళ్ల పేర్లు చిన్న కాగితాల మీద రాసుకొని వాళ్ల దగ్గర కన్సల్టింగ్ ఫీజు వసూలు చేసి నంబర్లు ఇస్తున్నాడు. కరుణాకరరావు లోపల గదిలో కూర్చుని ఒక్కొక్క నంబరు పిలిచి పేషెంటుకి పరీక్ష చేసి మందు రాసి ఇస్తే పక్క గదిలో కాంపౌండరు డబ్బు తీసుకొని మందులు కలిపి ఇస్తున్నాడు. ఆస్పత్రి అంతా హడావుడిగా ఉంది. ఆస్పత్రి ముందు ఒక కారు ఆగింది. లోపలికి భారంగా నడుస్తూ సేఠ్ రామదాస్ ప్రవేశించే సరికి సంగమేశం అర్జంటుగా ఆయనికి ఆహ్వానం చెప్పి సరాసరి డాక్టర్ గారి గదిలోకి తీసుకెళ్లేడు. డాక్టరు గారు ఒక పేషెంటు కడుపు నొప్పి బాధ వినడం సగంలో ఆపి సేఠ్ జీని కుచోమని మర్యాద చేశాడు.

"ఆఁ నొప్పి ఎక్కడ?".

"ఇక్కడ సార్! లోపల నుంచి గునపంతో పొడిచినట్లు వస్తుంది".

"ఇంకా".

"చెవి పోటు, కాళ్లు మంటలు, నాలిక ఎండడం".

"ఇంకా".

"ఒళ్లు పీకులు, గుండెదడ".

డాక్టర్‌కి నవ్వు వచ్చింది. సిమ్‌టమ్స్ ఒకదాని కొకటి కనెక్ట్ కావడం లేదు. వెంటనే అన్నాడు. "సరే నేను మందు ఇస్తాను. రెండు రోజులాగి మళ్లీ రండి". గబగబా ప్రిస్క్రిప్షన్ రాసి ఇచ్చి "పక్క గదిలో కాంపౌండరు మందిస్తాడు. మూడవ రోజున రండి. మందు రెండు పూటలా భోజనానికి ముందు ఒక మోతాదు తాగండి. పులుపు, కారం తగ్గించండి". అని చెప్పి "సంగమేశం!" అని పిలిచాడు కరుణాకరం. సంగమేశం తొందర తొందరగా లోపలకి వచ్చాడు.

"ఈ కడుపు నొప్పి పేషెంటు దగ్గర కన్సల్టేషన్ తీసుకున్నావా?"

"తీసుకున్నాను సార్!"

"నీకెన్ని సార్లు చెప్పాను? బీదవాళ్లను బాధించవద్దని. పాపం అతను మన వెనక వీధిలో ఎలిమెంటరీ స్కూలు టీచరు. ఇక మీదట అలాంటి వాళ్లని ఖండించి మాత్రం డబ్బు పుచ్చుకోకు. వెళ్లు......సారీ సేఠ్ జీ! మీరెందుకొచ్చారు? మీకు రెస్టు కావాలని చెప్పానుకదా! ఫోన్ చేస్తే ఏ సాయంకాలమో నేనే వచ్చేవాడ్నికదా!".

"లేదు డాక్టర్, మీనాన్న సంజీవ్ గారంటు ఉండేవారు, ముసలి కాలంలో చావు భయం ఎక్కువైపోతుందని. మళ్లీ మళ్లీ చిన్న వాళ్లతో కలసి మాట్లాడుతూ ఉంటే కొంచెం కొంచెం తాకత్ కలుగుతుందని'.

డాక్టర్ నవ్వుతూ సిస్టర్ అని పిలిచేసరికి అహల్య వచ్చింది,

"బ్లడ్ ప్రషర్ కట్టు" మెర్క్యురీకోలం జాగ్రత్తగా చూసి "మరేం పెద్ద తేడా ఏం లేదు. జాగ్రత్తగానే ఉంటున్నారు. మరేం కొత్త మందులు అక్కరలేదు. పాతవే నేచెప్పినట్లు కంటిన్యూ చెయ్యండి" అన్నాడు కరుణాకరం.

సేఠ్ జీ ఒక పచ్చ కాగితం టేబిల్ మీద పెట్టాడు.

"థాంక్స్!" అన్నాడు కరుణాకరం డ్రాయరులో నోటు పడేస్తూ.

"డాక్టర్?" అన్నాడు సేఠ్ జీ

"చెప్పండి!".

"ఏం లేదు ఈ రోజు ఏమిటో జ్ఞాపకాలు వస్తున్నాయి. పదేళ్ల క్రితం ఇలాగే చెకప్ కి మీనాన్నగారి దగ్గరకు వచ్చాను. ఒక పల్లెటూరు వాడు క్షయజబ్బుతో అనుకుంటాను బాగా భయంకరంగా ఉన్నాడు. పాతికేళ్లు కంటె ఉండవు. అది పది నిమిషాలు క్రితం మీరు సంగమేశాన్ని కేక లేసినట్లే అయునా కేక లేశాడు ధర్మాత్ముడు. వేలాది బీద ప్రజలకి వైద్య దానం చేసిన పుణ్యాత్ముడు" అని మార్వాడీ నిట్టూర్చాడు.

మార్వాడీకి ధర్మచింతన చాలా ఎక్కువైనందుకు కరుణాకరం చిరునవ్వు నవ్వుతున్నాడు మార్వాడీని చూస్తే కరుణాకరానికి జాలి.

చావంటే వీళ్ళకెందుకింత భయం? అతనికి తాను చేసినది ప్రత్యేకం ఏమీ లేకపోయినా వచ్చినప్పుడల్లా వంద ఇస్తాడు. నాన్నగారి సంగతులెత్తి గంటసేపు కాలక్షేపం చేస్తాడు అవతల పేషెంట్ల రద్దీ ఎక్కువగా ఉంది.

"అయితే సేఠ్‌జీ! ఋషీకేశ్‌కి ప్రయాణం ఎప్పుడు?" అడిగాడు కరుణాకరం. అతనికి తెలుసు. ఆమాట ఎత్తితే సేఠ్‌జీ వెంటనే సెలవు తీసుకుంటాడని వాళ్ళ నాన్నగారు తనకు చెప్పిన ట్రేడ్ సీక్రెట్ అది. ఈ ముసలాడు చివరి రోజుల్లో ఋషీకేశ్ పోయి యాత్రికుల సేవలలో కళ్ళు మూసుకోందామని కనీసం పదిహేనేండ్ల నుండి అనుకుంటున్నాడు. ఋషీకేశ్ వెళతాడని మాత్రం కరుణాకరానికి నమ్మకం లేదు.

"సార్!".

సంగమేశం లోపలకి వచ్చాడు. "ఫ్రాక్చర్ కేస్ సార్!" సేఠ్‌జీ సెలవు తీసుకున్నాడు ఆయనతో పాటు కరుణాకరం కూడా హాలులోకి వచ్చేడు. ఒక చిన్న పిల్ల కాలు విరిగింది. "ఎక్స్‌రే తీయాలి ఆ అమ్మాయిని జాగ్రత్తగా ఎత్తుకొని విరిగిన కాలెక్కడా కదలకుండా ఆ గదిలోనికి తీసుకెళ్ళండి" అన్నాడు కరుణాకరం.

టెక్నిషియన్ వెనకాల ఆ పిల్ల తండ్రి పిల్ల నెత్తుకొని బయలుదేరాడు ఇంతలో "నమస్కారం డాక్టరుగారూ!" ఒక పాతికేళ్ళ అమ్మాయి హాలులోకి వచ్చింది. డాక్టర్ తిరిగి చూసి "రామ్మా రా! హలో! ఎప్పుడు రాక?" అంటూ ఆమెను కన్సల్టింగ్ రూమ్‌లోకి తీసుకెళ్ళాడు. లోపల సిస్టర్! పుట్ హర్ ఆన్ ఎ సెడెటివ్. గెట్ మి ఫోర్ ఇంచ్ జిప్సోనా బేండేజెస్ ఫర్ ది కాస్ట్ ...... ఏం భయం లేదు లాయరూగారూ! పాపకిపుడు కట్టుకట్టి ఆరు వారాల తరువాత తీసేస్తాం."

"ఏదో డాక్టరుగారూ మీ దయ. ఆడపిల్ల అవిటిదైతే దాని జీవితాంతం బాధపడుతుంది".

"అదేం భయం లేదండీ! ఈ మాత్రం ఫ్రాక్చర్‌కే దిగులెందుకు?"

"చాలా బిజీగా ఉన్నట్టున్నారు" అంది తాయారు.

"ఆ ఎప్పుడూ బిజీనేలే".

"ఏమిటి విశేషం? ఎప్పుడు వస్తి?".

"నిన్ననే. యూనివర్సిటీలో సమ్మర్ ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చాను".

"ఎక్కడ ఉంటున్నావు?".

"విమెన్స్ హాస్టలులో".

"సరే మీదికి పద. ఇవ్వాల్టికి ఇక్కడే వుండువుగాని. రేపు ప్రొద్దున్నే డ్రైవర్ నిచ్చి హాస్టల్‌కి పంపుతా" అన్నాడు కరుణాకరం. సిస్టర్ బేండేజ్ రెడీ చేసింది. వెట్ ఫిల్మ్ పట్టుకొని టెక్నీషియన్ వచ్చాడు.

"కాంపౌండు ఫ్రాక్చర్. ఎక్కువ స్ప్లింటర్స్ అవలేదు బోను. ఎదిగే పిల్ల చాలా తేలికగా సెట్ అవుతుంది" అన్నాడు కరుణాకరం లాయరుగారి వేపు తిరిగి.

"అహల్యా! తాయారుని మీదకు తీసుకెళ్లి పంకజ చెల్లెలొచ్చిందని అమ్మకు చెప్పు". కట్టు పూర్తిచేసి మిగిలిన కేసులు చూసే సరికి ఒంటి గంటైంది. డ్రాయరు మూసి లేచాడు కరుణాకరరావు.

*   *   *   *   *

మీదకెళ్లేసరికి తాయారు మహాలక్ష్మమ్మ మాటాడుకుంటున్నారు, మహాలక్ష్మమ్మ చెబుతోంది "ఆమె అహల్య. మావారు మద్రాసులో చదివిన నాటి రోజులలో చిన్ననాటి స్నేహితుని కూతురు. మావారే చదువు చెప్పించి నర్స్ ట్రైయినింగ్ అయిన తరువాత ఆస్పత్రి పనిలో పెట్టారు. చాలా బుద్ధిమంతురాలు. మాకు తలలో నాలుకలా ఉంటుంది. చెల్లాయి చెల్లాయిని కరుణ ప్రాణం పెడ్తాడు. వాడూ ఒంటరివాడే కదా! మా అంబుజం బ్రతికుంటే అచ్చం అలాగే ఉండేది. అంబుజం అంటే కరుణకి ప్రాణం. అహల్య అంటే కూడా అంతే" కరుణ స్నానానికి వెళ్లాడు.

"అయితే అమ్మాయి, పంకజం ఇపుడెక్కడుంది?".

"ఆఁ బొంబాయిలో. మొన్ననే మా అక్కా, బావా అమెరికా నుండి తిరిగి వచ్చారు. అమెరికా అంటే విసుగెత్తిందిట. అక్క చదువుతూ ఉన్నన్నాళ్లూ అమెరికా అమెరికా అని గంగ వెర్రిలెత్తింది. అమెరికాలో ఉన్న మా మేనమామగారి అబ్బాయిని ఏరి కోరి కట్టుకుంది. ఇప్పుడు అంత చదువు చదివి ఇంట్లో గోళ్లు గిల్లుకుంటూ కూచుంది. వాళ్లాయనకి ప్రాక్టీసు పెట్టడం ఇష్టం లేదుట".

ఇంతలో కరుణ భోజనానికి వచ్చాడు. వాళ్ల భోజనాల తరువాత వచ్చింది అహల్య. అహల్య భోజనం చేస్తున్నంతసేపూ కరుణ, తాయారు అక్కడే కూర్చున్నారు. ఆమె భోజనం అయిన తరువాత "తాయారూ! నువ్వెళ్లి కాసేపు పడుక్కో. నేను కొంచెం సేపు నిద్రపోయి వస్తాను. సాయంత్రం బీచికి పోదాం. అహల్యా! సాయంత్రం ముఖ్యమైన కేసు లేమన్నా ఉన్నాయా?".

"ఆఁ ఆటెటనెన్ కేసు నిన్న రాత్రి చూసింది ఒకటుంది. ఇవాళ సాయంత్రం నాల్గింటికి వస్తామని చెప్పారు".

"ఓ అదా! అదెంతసేపు! ఆ కేసు చూసుకునే పోదాం షికారుకి" అన్నాడు కరుణాకరం లేస్తూ.

ఆ అమ్మాయి ఎవరో ఎందుకింత చనువుగా వాడితో మాట్లాడు తుంతో అహల్యకి అర్థం కాలేదు. సమయం వచ్చినపుడు కరుణే చెప్తాడని ఊరుకుంది. సాయంకాలం అనుకున్న ప్రకారం తిరిగి తిరిగి తొమ్మిదింటికి ఇల్లు చేరారు. అహల్య, తాయారు, కరుణ. భోజనాలు అవుతూవుండగానే గదిలో టెలిఫోన్ మోగింది. అహల్య వెళ్లి వెంటనే పరిగెట్టుకుంటూ వచ్చి చెప్పింది.

డాక్టర్ కృష్ణమూర్తిగారికి హార్ట్ఎటాక్. ఆయన భార్య మిమ్మల్ని రమ్మంటున్నారు.

"అరే" అంటూ లేచాడు కరుణాకరం.

"కృష్ణమూర్తిగారు మా గురువుగారు. నే వెళ్లి వస్తా. అహల్యా! తాయారుని కాస్త హాయిగా పడుకోనీ. టెలిఫోన్ ప్లగ్ తీసెయ్. లేదా

ఇక్కడికెందు కొచ్చానా అని పొద్దున్న విసుక్కుంటుంది" అని చిరు నవ్వుతో మేడ దిగాడు కరుణ.

తాయారుకి నిద్ర పట్టలేదు. ఏవో ఆలోచనలు. అక్కకి కరుణంటే చాలా అభిమానం అని తనకి తెలుసు. రాత్రి ఎంతైందో తెలియదు అప్పుడే పట్టింది చిన్న నిద్ర. కారు గారేజీలో పెడుతున్న శబ్దం విని నిద్ర పోయింది. కొంచెం సేపు పోయిన తరువాత తల్లీ కొడుకూ సంభాషణ వినవస్తోంది.

"ఏం అమ్మా! ఇంకా నిద్ర పోలేదా?".

"ఏం నిద్ర నాయనా! ఎప్పుడూ నువ్వూ నీ ఆస్పత్రి నీ అర్జంటు కేసులూ. నీ ఇంటికి దీపం ఎప్పుడు వెలిగిస్తావో".

"మనింటికి దీపాల కేం కొరత? మరో ట్యూబులైటు పెట్టించనా!" అన్నాడు కరుణ అమ్మ మాటలికి నవ్వేయడానికి ప్రయత్నం చేస్తూ.

"ఏమిటో నాయనా! నీ సంగతి నాకు అర్థం కావడం లేదు. ఆ అమ్మాయిని చూస్తే ముచ్చటేస్తుంది." కరుణకి కొంచెం కోపం వచ్చింది. ఏమీ అనలేదు. కాని అతని నిట్టూర్పు విని మహాలక్ష్మమ్మ విస్తుపోయింది.

మరునటి ఉదయం తాయారు పెందరాడే రెడీ అయింది. కరుణ వాష్ బేసిన్ దగ్గర పళ్లు తోముకుంటున్నాడు.

"మరి నే వెళ్లి వస్తాను. తొమ్మిదింటికి నేను క్లాసులో ఉండాలి" మహాలక్ష్మమ్మ వచ్చింది గదిలోకి. "అదేమిటమ్మా ఇక్కడే ఉండరాదూ? ఒంటరి దాన్ని. నాకు కాస్త ఊసుపోతోంది. డ్రైవరు కారులో తీసుకెళ్లి తీసుకొస్తూ ఉంటాడు".

"ఈ ఎందుకు లెండి. నాకు మధ్యాహ్నం కూడా ఏవన్నా క్లాసు లుంటాయి" అంది తాయారు సిగ్గు ఒలకబోస్తూ. కరుణ ముఖం కొంచెం ఎర్రబడింది. కొంచెం చిరునవ్వుతో "పోనీ, శనివారం సాయంత్రం కారు పంపనా! వీకెండ్ నాతో ఉండవచ్చు."

"సరే చూద్దాం" అని తాయారు కిందికి నడిచింది. ఈ లోపల అక్కడకు వచ్చిన అహల్య తాయారు వంకా కరుణ వంకా చిత్రంగా చూస్తూ నిలబడింది.

* * * * *

మరునటి శనివారం సాయంత్రం తాయారు వచ్చింది. అహల్య క్రింద నర్సింగ్ హోమ్‌లో ఏదో పని చూస్తోంది.

"హలో డాక్టరుగారూ! నర్సమ్మగారు లేరా? అని కొంటెగా అడిగింది. మొహం ఎరుపెక్కకుండా చిన్న చిరునవ్వుతో "ఓహో చెల్లాయా! ఇప్పుడే క్రిందకు వెళ్ళింది ఏం పిలవనా?".

"ఆఁ ఊరకే అడిగాను" తాయారు చిన్నబోయింది. సాయంత్రం ముగ్గురూ బీచికి పోయి ఎనిమిదింటి వరకు కబుర్లు చెబుతూ కూర్చున్నారు. అహల్యకు తాయారు మాట ఏమీ నచ్చలేదు. తాను కరుణ కనికరం మీద బ్రతుకుతున్నదన్న మాట వాస్తవమే. కాని కరుణ తనకు అన్నయ్య. తన మీద గొప్ప గౌరవం — తన వ్యక్తిత్వాన్ని గౌరవించి తన బ్రతుక్కి కొత్త మలుపు చూపిన మహనీయుడు, డాక్టర్ సంజీవరావుగారు. తన కథ గిర్రున తిరిగింది కళ్ళముందు. తను ఇంటర్ చదువుతుండగా పెళ్ళి చేశారు. హఠాత్తుగా ఆయన మరణం — చీకటి. అతి సామాన్య కుటుంబం. డాక్టర్ సంజీవరావుగారి గుండె చలవ — తనను మళ్ళీ మనిషిని చేశాడు, కరుణ అంటే తనకి అమితమైన ప్రేమ. కరుణ తనకి చెల్లెలుగా ఎంతో అభిమానిస్తాడు. కరుణ మీద తనకేమీ హక్కులేదు. కాని ఈ అమ్మాయి తనకేం నచ్చలేదు. లోపల బాధగా ఉంది. కరుణ ఒకవేళ ఆ అమ్మాయిని ...... మరి ఆలోచించలేక పోయింది బయటకి సరదగా మాట్లాడుతూ కాలక్షేపం చేసింది. ఆదివారం రోజవారీ పనితో సరిపోయింది. సాయంత్రం అంతా తిరగడానికి బయలు దేరడానికి రెడీ అయ్యారు. "భీమిలి వెళదా" మన్నాడు కరుణ. అహల్య సింపుల్‌గా తయారయింది. చిన్న తిలకం బొట్టు పెట్టుకుంది. ఆమె వితంతువని ఎవరికీ తెలియదు. తాయారు చాలా ఇలాబొరేట్‌గా ఒక గంట డ్రెస్ చేసుకుంది. కరుణ, అహల్య ఇవతల వరండాలో కూర్చున్నారు.

మహాలక్ష్మమ్మగారు అరవిందుని జీవిత చరిత్ర మీద మనస్సు లగ్నం చేయడానికి ప్రయత్నం చేస్తూ నిట్టూర్చింది.

ఇంతలో తాయారు గది బయటకు వచ్చింది. నీలి చీర, చక్కని మేచింగ్ బ్లౌజు. అహల్య కరుణ వేపు చూసింది. అతని కళ్లు ఆమె బ్లౌజు మీదనే ఉన్నాయి. ఏదో నిశ్శబ్దం, అహల్య చాలా డెలికేట్‌గా ఫీలై "చీర, బ్లౌజు చక్కగా మేచ్ అయ్యాయి, మీకు మంచి టేస్ట్ ఉంది" అని తాయారుని పొగిడింది. ఇంతలో టెలిఫోన్ మోగింది. కరుణ వెళ్లి తీసేడు.

"యస్.యస్ కరుణాకరావ్ హియర్ యస్. ప్లీజ్ పిలవండి, ఆ అవునండి, ఏమిటి విశేషం? ఓహో వెరీ గ్లాడ్! వెరీ గ్లాడ్! హోప్ ఎవ్రి థింగ్ ఈజ్ ఆల్‌రైట్, ఫైన్, ఏమంటారు? అహల్యా ఇక్కడే ఉంది, వన్ మినిట్" మౌత్ పీస్ మీద చెయ్యిపెట్టి "అహల్యా శాంతికి డెలివరీ టైమట విఠల్‌రావ్‌గారు ఫోన్ చేశారు. డాక్టర్ రెడ్డి డెలివరీకి ఎటెండ్ అవుతుందిట అంతా రెడీగా ఉన్నారు. శాంత నీకు ఫోన్ చెయ్యమందిట, నీలాటి స్నేహితురాలు పక్క నుంటే తనకు ధైర్యమని మరీ మరీ చెప్పమందిట, నీవు వస్తామంటే కారు పంపుతామన్నారు విఠల్ రావుగారు."

"శాంతికి డెలివరీ టైమా? నన్ను ప్రత్యేకం రమ్మందా? అన్నాయ్ నేవెళ్తా మీ పోగ్రామ్ మార్చుకోక భీమిలి వెళ్లి రండి, డెలివరీ అయిన ఓ గంటలో నేనింటికి వచ్చేస్తా."

"విఠల్‌రావ్‌గారూ! అహల్య వస్తానన్నది. కాని కారు మాత్రం పంపకండి. నేనెలాగూ బయలు దేరుతున్నాను. అహల్యను మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తా" అని కరుణ విసుకుగా ఫోన్ కింద పెట్టేశాడు.

"సరే చెల్లాయ్ పద. అక్కడ హడావిడిలో నే మాత్రం లోపలకి రాను" అన్నాడు కరుణ. అహల్య ముందు వెనక తాయారు. కరుణ మేడ దిగుతుంటే మహాలక్ష్మమ్మ బోల్డు ముచ్చట పడింది.

* * * * *

కారులో అహల్యను డ్రాప్ చేసిన తరువాత కరుణ, తాయారు మౌనంగా కూర్చున్నారు. కరుణ బుర్రలో ఆలోచనలు తను నడిపే కారు కంటే వేగంగా పరిగెడుతున్నాయి.

"ఏం తాయారూ! ఎలా ఉంది మీ అక్క. నే ఉత్తరాలు కూడా రాయడం మానేశాను."

"అక్క ఈ మధ్య ఏదో దిగులుగా ఉంటోంది డాక్టర్! ఆమె ఫారిన్ పిచ్చి పూరిగా వదలిపోయింది. ఇప్పుడిద్దరు పిల్లలు. అంత స్లిమ్‌గా ఉండే అక్కని ఇప్పుడెవరూ పోల్చుకోలేరు. బాగా లావెక్కిపోయింది. కొద్దిగా బ్లడ్ ప్రషర్ ట్రబుల్ కూడా ప్రారంభం అయిందిట. కనీసం తన డజను పాత జాకెట్లు సరికొత్త కండిషన్‌లోవి మొన్న నే వెళ్ళినప్పుడు నా సూట్‌కేస్‌లో పెట్టింది." బ్లౌజు మాట వినేసరికి మొహం పక్కకి తిప్పి తాయారు వంక చూసేడు కరుణ. ఇప్పుడతని అనుమానం తొలగిపోయింది.

"ఈ బ్లౌజు పదేళ్ళ క్రిందటి దంటే నమ్ముతారా!"

"ఫైన్. చాలా బాగుంది. నీవు విశాఖ వస్తున్నట్లు పంకజకు తెలుసా?"

"ఓఁ తెలియకేం. ఇక్కడికి వచ్చే ముందే కదా నే బొంబాయి వెళ్ళ."

కరుణ ముఖంలో అతిచిన్న చిరునవ్వు వెలిగింది. "ఇదిగో గంట స్తంభం" అన్నాడు.

సెంట్ ఏన్స్, కాన్వెంట్ వెనుక బీచిలో కూచుని ఇద్దరూ మౌనంగా చాలా సేపు గడిపారు. ఏం మాటాడాలో ఇద్దరికీ తెలియలేదు. కరుణకి తాయారుని పంకజం గురించి వేయి ప్రశ్నలు అడగాలని ఉంది. కాని ఎలా అడగాలో తెలియడం లేదు. తను వేసిన ప్రశ్నకి తాయారిచ్చిన సమాధానం మాత్రం ఆతని కెంతో తృప్తి నిచ్చింది, కొంచెం సేపు ఏవో సినిమాల గురించి విశాఖపట్నంలో పెరుగుతున్న ప్రజానీకం గురించి సమస్యలు గురించి ఇద్దరూ మాటాడుకున్నారు. తాయారు మనసులో

మరీ బాధగా ఉంది. ఈ సాయంత్రం తన అదృష్టాన్ని వెచ్చుకొని ఏదో సాధించగలననుకొన్నది. కాని తనకెప్పుడూ ఎదురయ్యే ఫెయిల్యూర్ మళ్లీ ఎదురైంది. మరికొంతసేపు పోయాక ఇద్దరి గుండెలూ బరువెక్కాయి. మరి కూర్చోలేక లేచారు. అలా కాసేపు ఇసకలో తిరిగి మళ్లీ కారు దగ్గరకు వచ్చారు. కారు చూసి మళ్లీ కరుణకు ప్రాణం వచ్చింది. రోడ్డు వైపే దృష్టిపెట్టి ఓ అరగంటలో ఇల్లు చేరారు. భోజనాలు చేసి అంతా ఇవతల వరండాలో కూర్చున్నారు. మహాలక్ష్మమ్మ పంకజం పిల్లలు గురించి తాయారుని బోల్డు ప్రశ్నలు వేస్తూంది. కరుణ పరాకుగా ఏదో మెడికల్ జర్నల్ పేజీలు తిరగ వేస్తున్నాడు. అహల్య వచ్చింది చేటంత మొహంతో. "అన్నాయ్! శాంతికి పండంటి మగ బిడ్డడు. డాక్టర్ రెడ్డి సిజేరియన్ చేసి తీసింది. బాబు ప్రైయిజు బేబీ పదకొండు పౌన్లు ఉండవచ్చు. పెయ్ చేస్తానంటే విఠల్‌రావ్ గారి మొహం ఎర్రబడింది." అని గట్టిగా నవ్వింది. కరుణాకరం నవ్వలేదు. అహల్య చిత్రంగా చూసింది. ప్రజలో ఇలాంటి ప్రవర్తనలు చూసి నవ్వుకోవడం వారిద్దరికీ అలవాటే. అహల్యకి కరుణ సీరియస్‌నెస్ ఎంత ప్రయత్నం చేసినా అర్థం కాలేదు. సాధారణంగా కరుణ తనతో అన్ని విషయాలూ చెప్తాడు. తను మద్రాసులో ట్రెయినింగ్ అవుతున్న రోజులలో కూడ కరుణ తనని ఈక్వల్‌గానూ, చెల్లెలి గానూ చూశాడు. ఈ అమ్మాయి ఎవరో, కరుణ వింత ప్రవర్తన ఏమిటో అహల్యకి అర్థం అవడం లేదు.

మరుసటి రోజు తాయారు హాస్పటల్‌కి వెళ్లిపోయింది. మళ్లీ ఆదివారం నాడు మహాలక్ష్మమ్మగారు కారు పంపినా రాలేదు. ఒకసారి సమ్మర్ కోర్సు వాళ్లతో అరకు ఎక్స్‌కర్షన్ అని, మరో ఆదివారం ఏదో ఎసైన్‌మెంట్ మీద వర్క్ చేస్తున్నానని కబురంపింది తాయారు. వెళ్తున్నానని చెప్పడానికి మాత్రం వచ్చి కొంచెం సేపుండి వెళ్లిపోయింది. మహాలక్ష్మమ్మగారు అమ్మాయిని చాలా ఆదరించి చీర, బ్లౌజు తెప్పించి ఇచ్చింది. అహల్యకు ఇదేం అర్థం కాలేదు.

ఆ రోజు ఆదివారం. తాయారు వెళ్లిపోయి వారం కావస్తోంది. సాయంకాలం కరుణ తన గదిలో బట్టలు వేసుకుంటున్నాడు. ఇవతల

వరండాలో ఒకమూల కూచోని అహల్య క్రిష్టియన్ బార్నార్డ్ 'వన్ లైఫ్' చదువుకుంటూంది. వాష్‌కాన్‌స్కీకి కొత్త గుండె వేసిన కొన్ని రోజుల తరువాత ఆస్పత్రిలోని ఘట్టం చదువుతోంది. ఆస్పత్రిలో స్టాఫ్ అంతా పని చేసి చేసి నలిగి పోయారు. డాక్టర్ సిస్టర్ పాసేవ్‌డీర్‌కి రెండు రాత్రిలు ఆఫ్ ఇచ్చాడు. కాని ఒకరాత్రి తరువాతే సిస్టర్ పేషెంటుని చూడకుండా ఉండలేక ఆస్పత్రికి వచ్చింది. ఏం కర్తవ్య నిర్వహణ? చావుని గెలవడానికి ఏం కృషి, ఏం ఆరాటం? బార్నార్డ్ విజయంలో తనకూ భాగముంది. ఆసిస్టర్ జీవితం ఊహించుకొని తోటి మనిషి సేవకి అంకితం చేద్దామని అనుకుంటోంది అహల్య. పుస్తకం చదువుతూ చదువుతూ బార్నార్డ్ మీంచి కరుణ వైపు పోయింది ఊహ. ఎప్పుడూ సరదాగా ఉండేవాడు. కొన్ని వారాలుగా ముభావంగా ఎందుకుంటున్నాడు? తాయారు సడన్‌గా ఎందుకు రావడం మానేసింది? కరుణకి చూస్తే ఏదో బాధగా ఉంది.

"చెల్లాయ్!" పిలిచాడు కరుణ.

ఈ సమయంలో తనతో ఏంపనా అని ఆలోచిస్తూ "ఏం అన్నాయ్" అంది అహల్య.

"ఏం ఊసుపోవడం లేదు క్లబ్బుకి వెళ్లాలని అనిపించడం లేదు. సినిమాకు పోదాం వస్తావా?" అన్నాడు.

"సరే" అంటూ లేచింది అహల్య

సినిమాలో జనం కిటకిట లాడుతున్నారు. సినిమా అవుతున్నంత సేపూ మెల్లగా ఏదో కరుణ రన్నింగ్ కామెంట్రీ ఇచ్చేవాడే. ఇవాళ మౌనంగా కూర్చున్నాడు. ఏదో వింతగా ఉంది. కొంచెం సేపు పోయాక "ఏం అన్నాయ్? సినిమా బాగులేదు. ఇంటికి పోదామా?" అంది అహల్య.

ఇద్దరూ బయటకి వచ్చేరు. కారు బయటకు తీసుకుని రోడ్డు మీదకి వచ్చిన తరువాత "ఇప్పుడిప్పుడే ఆకలి కావటం లేదు. ఇంటికెళ్తే అమ్మ భోజనం చేయమంటుంది. కాసేపు బీచిలో కూర్చుందాం" అన్నాడు కరుణ.

ఇసుకలో ఇద్దరూ కూర్చున్నారు. కరుణ పరాగ్గా ఏదో ఆలోచిస్తున్నాడు అహల్యకు కరుణ ఏదన్నా మాట్లాడితే బాగుండునని పించింది. చూసి చూసి తనే అడిగింది.

"తాయారు గురించి నీ అభిప్రాయం?" ప్రశ్న పూర్తిగా అడిగిన తరువాత ఎందుకడిగేనా అని బాధపడింది.

"పంకజం చాలా తెలివైంది."

తాయారు గురించి అడిగితే పంకజం గురించి చెప్తాడేం అనుకుంది అహల్య కాని వెంటనే అర్థమయింది. అయితే కరుణ పంకజం గురించి ఆలోచిస్తున్నాడన్నమాట.

"పంకజం ఎవరు?"

"తాయారు అక్క. నా క్లాస్ మేట్. మేం ఇద్దరం చాలా గాఢ స్నేహితులం మా ప్రేమాయణం ఊరందరకీ తెలిసిందే. నాన్నగారు చూసీ చూడనట్టు ఊరకుండేవారు. పంకజం సర్జరి ప్రొఫెసర్ కూతురు. నాన్నగారూ, ఆయన చిన్ననాటి నుంచీ మంచి స్నేహితులు. మా ఫేమిలీ ఫ్రెండ్స్. కాలేజీ రోజుల్లో పంకజం చాలా చలాకీగా ఉండేది. హౌస్ సర్జన్సీ రోజుల్లో మా పరిచయం కొంచెం చిక్క బడింది. ఫేమిలీ ప్లానింగ్ సెమినార్ మా హౌస్ సర్జన్సీ చివరి రోజుల్లో హైదరాబాద్ లో జరిగింది. కుటుంబ నియంత్రణ ప్రభుత్వ విధానంగా మన దేశంలో వస్తున్న కొత్త రోజులు. మమ్మల్నిద్దరినీ పంపేరు మెడికల్ స్కూల్ నించి. మరేం ఇద్దరమూ చేరాము హైదరాబాదులో. కాచిగూడా స్టేషన్ దగ్గర ఉన్న టూరిస్ట్ హోటల్ లో దిగాము. పంకజం చిరునవ్వు నవ్వుతుండగా డాక్టర్ ఎండ్ మిస్ కరుణాకరరావ్ అని హోటల్ బుక్ లో రాశాను. ఒక డబుల్ రూం తీసుకున్నాం ..."

చాలాసేపు కరుణాకరం మాట్లాడలేదు. అహల్య అతన్ని డిస్టర్బ్ చేయలేదు. కొద్ది నిమిషాలు తరువాత ఉస్సురని నిట్టూర్చి కరుణ మళ్లీ ప్రారంభించాడు.

"ఆవేళ ఏదో అమెరికన్ ప్రొఫెసర్ టాక్ విన్నాము, సాయంకాలం మా కెక్కడికీ వెళ్ళ బుద్ధి వేసేది కాదు. సెమినార్ ముగిసిన తరువాత ఊళ్ళో అలా కాలినడకన తిరిగే వాళ్ళం. కాచిగూడా చౌరాస్తా ముందు ఒక మార్వాడీది ఒక పెద్ద బట్టల కొట్టు ఉంది. ఒకనాడు దాని పక్కనుండి నడుస్తూ నాకొక చిత్రమైన బుద్ధి పుట్టింది. ఇద్దరం కొట్లోకి వెళ్లేం. పంకజం ఏవో చీరలు చూస్తోంది. నాకు రోల్ చేసిన పట్టు బ్లౌజు మెటీరియల్ కనబడింది అందులో నాకు నీలిరంగు బాగా నచ్చింది. "అద్భుతం" అన్నాను "ఏమిటి?" అంది పంకజం చిత్రంగా చూస్తూ. ఆనీలంబట్ట చూపించి ఒక బ్లౌజు ఇమ్మన్నాను, నా చేతితో పంకజం కిచ్చిన ప్రెజెంట్ అదే. మరుసటి దినం బ్లౌజుకు మేచయ్యే చీర కోసం పంకజం హైదరాబాదు గాలించింది. అంతే దాని సంగతి మరచి పోయాను.

"నీకు తెలియదు కానీ పంకజం నేను సడన్‌గా విడిపోయాము నాన్నగారు పోయిన తర్వాత పంకజంకు అమెరికా పిచ్చి. అమెరికా వెళ్లి సరదాగా గడపాలని ఆశ. అమెరికన్లులాగే మనం ఉండాలని అనుకుంటూ ఉండేది. నాకు నాన్నగారి ప్రాక్టీసు చూసుకోవలసిన బాధ్యత,నాన్నగారు పోవడంతో అమ్మ ఏకాకి అయింది. అమ్మ నొదలి, దేశం వదిలి పోవడం అంటే బాధగా ఉండేది. ఇంతలో పంకజంకు వాళ్ల వాళ్లు సంబంధం కుదిర్చేరు. పెళ్లికొడుకు అమెరికాలో ఇంజనీర్. ఏదో దగ్గర సంబంధమే ... అమ్మ చాలా బాధపడింది."

"ఇంతకీ నే నడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పావు కాదు" అంది ఆలోచనతో అహల్య.

"పంకజం చాలా తెలివైంది."

మళ్లీ మొదటికొచ్చేడు అనుకుంది అహల్య.

"అంటే?"

"పంకజంకు తెలుసు, నేను చాలా బాధపడుతున్నానని తాను పొందలేక పోయింది చెల్లెలయినా పొందగలుగుతుందని అనుకుంది. తెలివిగా తాయారుని పంపింది. ఎంతమటుకు బ్రీఫ్ చేసిందో తెలియదు. చాలా రోజుల తర్వాత హఠాత్తుగా వచ్చిన తాయారు అమాయకంగా

రా లేదని నాకనిపించింది. అమ్మ మనింట్లో ఉండమని కోరితే ఉండలేదు. అమ్మ మనస్తత్వం పంకజంకు బాగా తెలుసు. బొత్తిగా మనిషి వాపు మనిషి. మరీ దగ్గరంగా ఉండక దూరంగానే ఉండి అమ్మను రెచ్చగొట్టింది. మనం భీమిలి వెళదామను కొన్నప్పుడు చూశావా ఎలా తయారయిందో. నీవంటే తాయారు లోపల అసహ్యించుకున్నది. కారణం? అంతు తెలియని అసూయ. మరో సంగతి. తాయారు పంకజం లాగే స్నాబ్. తన కంటె సాంఘికంగా తక్కువస్థాయిలో వున్నవాళ్లని చులకనగా చూస్తుంది. విఠల్ రావ్ గారి టెలిఫోన్ కాల్ దైవికంగా వచ్చినా తన మంచికే అనుకుంది. కాని నీవు చేయవలసినది చేసి వెళ్లావు. తాయారు బ్లౌజను మెచ్చుకున్నావ్ జ్ఞాపకం ఉందా? అప్పుడే అనుమానం కలిగింది. తాయారుని, పంకజం పంపించిందా అని. భీమిలి వెళ్లాం. ఆలోచనల బరువుతో నాకట్టే మాట్లాడాలని పించలేదు. ఎలాగైతేనేం చివరికి అడిగాను పంకజం ఎలా ఉందని. చెప్పింది. ఇద్దరు పిల్లలు బాగా లావై పోయిందిట. ఏదో దిగులుట, మాటవరసకి చెప్పింది. పదేళ్ల క్రిందటివి ఒక డజను జాకట్లు తన సూట్ కేస్‌లో పడేసిందని. బ్లూ బ్లౌజు మళ్ళీ చూసి తృప్తిగా నవ్వుకున్నాను. అప్పుడడిగేను. 'నీవు విశాఖ వస్తున్నట్లు పంకజంకు తెలుసా?' తెలియకేం విశాఖ వచ్చేముందే కదా నేను బొంబాయి వెళ్తా అంది. అప్పుడు తెలిసింది పంకజం చాలా తెలివయిందని. మళ్ళీ పంకజం లాంటి మనిషి ఎప్పుడు కనిపిస్తుందో. ఎవరిని చూసినా ఏదో ఒక లోపం. అమ్మబాధ చూడలేను కాని మనసుకు ద్రోహం చేసుకోలేను కదా!'' ఇప్పుడు బోధపడింది అహల్యకు. కరుణ గాంభీర్యానికి అర్థం. రాత్రి పది దాటింది. ఇద్దరూ లేచారు. ఇల్లు చేరేసరికి అమ్మ మేల్కొని ఉంది.

"ఏం అహల్యా! ఇంత ఆలస్యం?"

కారు గారేజీలో పెట్టి లోపలకు వస్తావుంటే అహల్య సమాధానం వినబడింది.

"సినిమాలో ఉండగా ... హార్ట కేస్ ..."

ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక
2-2-73